క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



మృతుడు భార్యకు తక్షణ సహాయం అందిస్తున్న సచివాలయం సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి సచివాలయం సిబ్బంది వైఎస్సార్ బీమా పరిహారం అందించారు. ఇందిరానగర్‌కు చెందిన మన్యాల అప్పలరాజు(39) ఈ నెల 28న అడవివరం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు వైఎస్సార్ బీమా వర్తించింది. ఈ మేరకు 22వ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ అనిమిరెడ్డి రమణతో కలసి మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి అప్పలరాజు బుధవారం ఇందిరానగర్‌లో మృతుడు భార్య మన్యాల రామలక్ష్మికి తక్షణ సహాయం కింద రూ.10 వేలు నగదు అందజేశారు. మిగతా మొత్తం ఆమె బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని తెలిపారు.

పాఠశాలకు పుస్తకాల వితరణ



పుస్తకాలు అందిస్తున్న కాన్సెంట్రిక్స్ సంస్థ ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు మాధ్యమం పాఠశాల విద్యార్థులకు కాన్సెంట్రిక్స్ సంస్థ విలువైన పుస్తకాలను బుధవారం బహూకరించింది. పాఠశాల గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపయుక్తంగా వీటిని ఉంచాలని సంస్థ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.సలోమి, ఉపాధ్యాయులు, కాన్సెంట్రిక్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధకులకు ఏయూ డాక్టరేట్‌లు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగ పరిశోధకురాలు కర్రి లీలా వెంటక నాగశ్రీకి ఏయూ డాక్టరేట్ లభించింది. స్టడీస్ ఆన్ సింథసిస్ స్ట్రక్చరల్ ఎలక్ట్రికల్ అండ్ మేగ్నటిక్ ప్రోపర్టీస్ ఆఫ్ ఎం.జి, సియూ, జెడ్ఎన్, సీఈ, సబ్‌స్టిట్యూటెడ్ కోబాల్ట్ నానో ఫెర్రీటిస్'అంశంపై ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత పర్యవేక్షణలో జరిపిన పరిశోధనకు ఆమెకు డాక్టరేట్ వచ్చింది.

• భౌతికశాస్త్ర విభాగ పరిశోధకురాలు నగిరెడ్డి పద్మజ లావణ్యకుమారికి ఏయూ డాక్టరేట్ లభించింది. డెవలపింగ్ ఆఫ్ ఏన్ ఆటోమేటిక్ స్పీచ్ రికగ్నిషన్ సిస్టం యూజింగ్ డీప్ న్యూరల్ నెట్‌వర్క్స్'అంశంపై ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత పర్యవేక్షణలో జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు వారిద్దరూ ఇన్‌చార్జి వీసీ సమత నుంచి ఉత్తర్వులు స్వీకరించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మా సంకల్పం వికసిత భారతం సెల్ఫీ స్టాండ్ వద్ద లబ్ధిదారులతో జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి

మద్దిలపాలెం : కేంద్ర ప్రభుత్వం మహిళల ప్రగతికి ప్రవేశ పెడుతున్న పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి సూచించారు. 23వ వార్డులో మద్దిలపాలెం ఎస్వీకే కళాశాల ఆవరణలో బుధవారం మా సంకల్పం వికసిత భారతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం ప్రతిష్టాత్మకంగా మహిళల ఆరోగ్యానికి, ఆర్థిక ప్రగతికి చేపడుతున్న కార్యక్రమాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ దుర్గాప్రసాద్, డీపీవో శశిభూషణం, ఇసుకతోట అర్బన్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్ర వైద్యాధికారి రెనిషా, పీవో రమణమ్మ, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ కాంతులు..!

- తూర్పులో చురుగ్గా కల్యాణ మండపాల నిర్మాణం
- ఆధునిక హంగులు.. వసతుల కల్పన
- అభివృద్ధి పనులపై ప్రజల హర్షం





17వ వార్డులో సిద్ధమవుతున్న కల్యాణ మండపం



ఎంవీపీ కాలనీ సెక్టార్-1లో నిర్మించనున్న మినీ కన్వెన్షన్ హాల్ నమూనా

- ఎంవీపీ కాలనీ సెక్టార్-1లో కన్వెన్షన్ హాల్ రూ.4.15 కోట్లు
- బాలాజీనగర్ కల్యాణ మండపం రూ.6 కోట్లు
- అప్పుఘర్ సామాజిక భవనం మరమ్మతులు రూ.16 లక్షలు
- పెదవాల్తేరు కల్యాణ మండపం రూ.48 లక్షలు

ఎంవీపీ కాలనీ: తూర్పు నియోజకవర్గ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఒరవడిని సృష్టించింది. పార్కులు, ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పెద్ద ఎత్తున నిర్మించడం, అభివృద్ధి చేయడంతో పాటు పెద్ద ఎత్తున సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టింది.

రూ.4.15 కోట్లతో ఫంక్షన్ హాల్

ఎంవీపీ కాలనీలోని సెక్టార్-1లోని వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపం స్థానంలో కన్వెన్షన్ హాల్ నిర్మాణం చేపట్టారు. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రూ.4.15 కోట్ల వ్యయంతో ఈ కన్వెన్షన్ హాల్‌ను నిర్మిస్తున్నారు. సెల్లార్+ 2గా దీని నిర్మాణం జరగనుంది. 1000 చదరపు గజాల విస్తీర్ణంలో చేపట్టనున్న ఈ నిర్మాణంలో సెల్లార్‌ను పూర్తిగా పార్కింగ్ కోసం కేటాయించనున్నారు. పై రెండు అంతస్తుల్లో రెండు భారీ హాళ్లను నిర్మించనున్నారు. 5000 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ హాల్స్ నిర్మాణం జరగనుంది. అధునాతన సీటింగ్ సౌకర్యంతో సీలింగ్, ఎలివేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్లాన్‌ను రూపొందించారు.

తుది దశకు పెదవాల్తేరు కల్యాణ మండపం

17వ వార్డు పెదవాల్తేరులో రూ.48 లక్షలతో కల్యాణ మండపాన్ని జీవీఎంసీ నిర్మించింది. ఇప్పటికే ఈ పనులు తుదిదశకు చేరుకున్నాయి. గత కొన్నేళ్లుగా పెదవాల్తేర్ ప్రాంత ప్రజలకు కల్యాణ మండపంతో పాటు సామాజిక భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక కార్పొరేటర్ చొరవతో జీవీఎంసీ రూ.48 లక్షలతో కల్యాణ మండపాన్ని సిద్ధం చేస్తోంది. 50 అడుగుల పొడవు, 25 అడుగుల వెడల్పుతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 90శాతం పనులు పూర్తికాగా త్వరలోనే ఇది ప్రజల సేవలకు అందుబాటులోకి రానుంది.

అప్పుఘర్ సామాజిక భవనానికి ప్రహరీ

18వ వార్డు అప్పుఘర్‌లో ఉన్న సామాజిక భవనానికి జీవీఎంసీ కొత్త హంగులు అద్దింది. గతంలో ఇక్కడ సామాజిక భవనం నిర్మించినప్పటికీ కాంపౌండ్ వాల్ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుల చొరవతో జీవీఎంసీ ఈ సామాజిక భవనానికి కొత్త హంగులు అద్దింది. రూ.16 లక్షలతో చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించడంతో పాటు టాయిలెట్స్ ఆధునికీకరించి, రంగులు వేసి పూర్తి స్థాయిలో ముస్తాబు చేశారు.

రూ.5 లక్షలతో సామాజిక భవనం మరమ్మతులు

జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో బీఆర్‌టీఎస్ పక్కన గ్రీన్ కారిడార్ ఆవరణలో గతంలో నిర్మించిన సామాజిక భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో జీవీఎంసీ అధికారులు సుమారు రూ.5 లక్షలతో ఈ భవనానికి మరమ్మతులు చేపట్టి కొత్తదనం తీసుకొచ్చారు.

ప్రజల అవసరాలు తీర్చేలా ప్రభుత్వ చర్యలు



ప్రజల అవసరాలు తీర్చేందుకు అనుగుణంగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. పాఠశాలలు, ఆస్పత్రులు, పార్కులు, ఇలా అన్నింటా సౌకర్యాలు మెరుగుపరచింది. ఇందులో భాగంగా జీవీఎంసీ నాలుగున్నరేళ్లలో ఇలాంటి ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చింది. 17వ వార్డు ప్రజల చిరకాల కోరికగా కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. అప్పుఘర్ కల్యాణ మండపం గతంలో అధ్వానంగా ఉండేది. చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి గేటు పెట్టడంతో బాగుంది. ఇలా ఎన్నో సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

– లక్ష్మణరెడ్డి, 17వ వార్డు



అప్పుఘర్ సామాజిక భవనానికి నిర్మించిన కాంపౌండ్ వాల్

ఆధునిక హంగులతో బాలాజీనగర్ కల్యాణ మండపం



బాలాజీనగర్‌లో నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం



కల్యాణ మండపం నమూనా

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జీవీఎంసీ పలు అభివృద్ధి పనులు చేపడుతోంది. తూర్పు నియోజకవర్గంలో రూ.కోట్ల నిధులతో చేపట్టిన పలు నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా నియోజకవర్గంలో జోన్-2 పరిధిలో 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో సామాజిక భవనం మరమ్మతులు, 11వ వార్డులో కొత్త కల్యాణ మండపం నిర్మాణం చేపడుతున్నారు.

• జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్(పాత ఆరిలోవ)లో రూ.6 కోట్ల నిధులతో ఆధునిక కల్యాణ మండపం నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడ గతంలో జీవీఎంసీ నిర్మించిన కల్యాణ మండపం శిథిలమైంది. ఇది కూలిపోయే పరిస్థితికి చేరింది. పేదలు అత్యధికంగా ఉన్న ఈ ప్రాంతానికి పెద్ద కల్యాణం మండపం అవసరమని గుర్తించిన మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఈ మేరకు కృషి చేశారు. పాత భవనాన్ని పూర్తిగా తొలగించి దాని స్థానంలో ఆధునిక హంగులతో కొత్త కల్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 11న ఈ పనులు ప్రారంభించారు. ఇక్కడ సుమారు 2,000 చదరపు గజాల స్థలంలో రూ.6 కోట్ల నిధులతో జి ప్లస్ టు నిర్మాణం చేపడుతున్నారు. సెల్లార్‌ను వాహనాల పార్కింగ్ కోసం వినియోగించనున్నారు. గ్రౌండ్, మొదటి అంతస్తులు డైనింగ్ కోసం, రెండో అంతస్తు వేదిక కోసం వినియోగించేలా నిర్మాణం చేపడుతున్నారు. రెండు లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి సమస్య లేకుండా కల్యాణ మండపం లోపలే విశాలమైన పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నారు.

కల్యాణ మండపం అవసరం తీరుతుంది..



ఆరిలోవ ప్రాంతంలో లక్షకు పైగా జనాభా ఉన్నారు. ఇక్కడ మంచి కల్యాణ మండపం లేకపోవడంతో ఫంక్షన్లు చేయడానికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పుడు ఇక్కడ కొత్త కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. ఆధునిక సౌకర్యాలతో మండపం నిర్మిస్తుండడంతో ఈ ప్రాంతం ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వంతో పాటు మేయర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– మీసాల రాము, అప్సరకాలనీ, ఆరిలోవ, 11వ వార్డు

రాష్ట్రాభివృద్ధి కోసం మళ్లీ వైఎస్ జగన్ అవసరం

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ
- ఉత్సాహంగా 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం



19వ వార్డు పెదజాలరిపేటలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



13వ వార్డు జేఎన్‌ఎన్‌యూఆర్ఎం కాలనీలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రిగా మళ్లీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రావాలని ప్రజలు కోరుకుంటున్నట్టు విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డు శ్రీకాంత్‌నగర్ జేఎన్‌ఎన్‌యూఆర్ఎం కాలనీలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కెల్ల సునీత, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎంపీ పార్టీ జెండా, సంక్షేమ పథకాలు వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎంవీవీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి, మైనారిటీ వర్గాల ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగడానికి వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, బేతా దుర్గారావు, వనం వరలక్ష్మి, జగన్, శిరీష, వెంకటరెడ్డి, పోలరావు, సచివాలయాల గృహసారథులు, కన్వీనర్లు, పాల్గొన్నారు.

మద్దిలపాలెం : ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని బుధవారం 16వ వార్డులో కార్పొరేటర్ మొల్లి లక్ష్మి ఆధ్వర్యంలో భానునగర్ సచివాలయం 114 పరిధిలో జరిగింది. ఈ సందర్భంగా ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, క్లస్టర్ల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 19వ వార్డు పెదజాలరిపేటలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ ముఖ్య నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎంవీవీ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో పేదలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. మత్స్యకారులకు భరోసా కల్పించారన్నారు. వేట విరామ సమయంలో రూ.10 వేలు అందిస్తున్నారన్నారు. పెదజాలరిపేట రూపురేఖలు మార్చారన్నారు. ప్రధాన రహదారి నిర్మాణం కూడా త్వరలోనే పూర్తవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు, పరసన్న, గణేష్, వసంత, తదితరులు పాల్గొన్నారు.

21వ వార్డులో..

బీచ్ రోడ్డు: గత ప్రభుత్వానికి ప్రస్తుతం జగనన్న సర్కారుకు ప్రతి ఒక్కరూ వ్యత్యాసం తెలుసుకోవాలని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కోరారు. జీవీఎంసీ 21వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పథకాలతో కూడిన డిజిటల్ బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలన్నీ వంద శాతం పూర్తి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి మధుపాడ రవికుమార్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భజన

మద్దిలపాలెం : గౌరీపరమేశ్వరుల ఉత్సవాలలో భాగంగా బుధవారం పాత వెంకోజీపాలెం సీతారామాలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో భజన చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామంలోని మహిళలు గౌరీపరమేశ్వరులను కీర్తించారు.

ఆచార్య రంగథామారావు స్మారకోపన్యాసం



ప్రసంగిస్తున్న ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆచార్య కె.రంగథామారావు స్మారక ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఇటువంటి స్మారక ప్రసంగాల వల్ల ప్రముఖుల జీవితాలు, పరిశోధన రంగంలో వారు అందించిన సేవలను తెలుసుకునే అవకాశం యువతకు కలుగుతుందన్నారు. ఆచార్య రంగథామారావు జీవిత విశేషాలను నేటితరం యువత తెలుసుకుని, స్ఫూర్తిని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎస్.రాజు, విశ్రాంత ఆచార్యులు సి.శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు. ఐఐటీ చెన్నై విశ్రాంత ఆచార్యులు ఐ.శోభనాద్రి, ఐఐఎస్‌సీ బెంగళూరు విశ్రాంత ఆచార్యులు జె.రామకృష్ణ కీలకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర, స్టాటస్టిక్స్ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. గణితశాస్త్ర విభాగంలో జరిగిన వేడుకలను సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జి.నానాజీరావు, విభాగ ఆచార్యులు పి.డి.ఎన్.శ్రీనివాసరావు, ఆచార్య అనురాధ కామేశ్వరి, డాక్టర్ ఎస్.రామకృష్ణ, డాక్టర్ ఎస్.రవికుమార్, డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు.

• ఏయూ టీఎల్ఎన్ సభా మందింరలో స్టాటస్టిక్స్ విభాగం విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం ఉదయం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, విభాగాధిపతి ఆచార్య బి.మునిస్వామి, బీవోఎస్ చైర్ పర్సన్ ఆచార్య నిరపమ దేవి పాల్గొన్నారు.

అలరించిన అమృత గాత్ర కచేరీ



భక్తి గీతాలు ఆలపిస్తున్న అమృత

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ 54వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం బెంగళూరుకు చెందిన అమృతా వెంకటేష్ గాత్ర కచేరీ అలరించింది. వయోలిన్‌పై ఎల్.రామకృష్ణ, మృదంగంపై అర్జున్ గణేష్ ఇచ్చిన సహకారంతో కచేరీ శ్రావ్య నందకరంగా సాగింది.

భాషా నైపుణ్యం పెంచుకోవాలి



ముగింపు సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం : డిగ్రీ చదువుతున్నప్పుడే భాషా నైపుణ్యాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాలలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్ భాషాభివృద్ధితో దోహదపడుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త రామారావు, కె.రవిబాబు, శ్రావణ్‌కుమార్, శ్రీనివాసరావు, రాణి, పోలా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కవిత్వం.. ఓ జీవనది

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో ఆంధ్రేతర భారతీయ కవిత్వం, పరిచయం అను అంశంపై డాక్టర్ కె.జి.వేణు ప్రసంగించారు. కవిత్వం ఒక అనుభూతి, ఒక రసానుభూతి అని, కొత్త రూపాలూ సంతరించుకుంటూ, కొత్త రుచులు పంచుకుంటూ ఒక జీవనదిలా సాగిపోతుందన్నారు. నిజాయితీపరమైన నిబద్ధత కలిగిన కవులు రాసే కవిత్వం గొప్పదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అటువంటి మంచి కవిత్వాన్ని అందించిన ఆంధ్రేతర కవులు సుబోధ్ సర్కార్, మనుష్య పుథిరన్, టి.పి.రాజన్, సీతాకాంత మహాపాత్ర, చాను షర్మిల, అమర్జీత్ చందన్, మందక్రాంత సేన్ తదితరుల గురించి వివరించారు. కార్యక్రమంలో రచయితలు శేఖరమంత్రి ప్రభాకర్, డి.వి.సూర్యారావు, కర్రా ప్రసాదరావు, చిన సూర్య నారాయణ, కొత్తూరి రమణ పాల్గొన్నారు.